క్లుప్తంగా

సీఎస్ఎన్ కళాశాలలో ఎంసీఏ, ఎంబీఏ విభాగాలకు అదనపు సీట్లు



కళాశాలకు అదనపు సీట్లు మంజూరైన ఉత్తర్వులను చూపుతున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని డాక్టర్ సీఎస్ఎన్ కళాశాలలోని ఎంబీఏ, ఎంసీఏ విభాగాలకు ఏఐసీటీఈ అదనపు సీట్లు కేటాయించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సకుమళ్ల సత్యనారాయణ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఎంసీఏ విభాగంలో 60 సీట్లు, ఎంబీఏ విభాగంలో 60 సీట్లు అదనంగా మంజూరు చేశారని చెప్పారు. అలాగే డిగ్రీ విభాగంలో బీఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, బీఎస్సీ ఫిషరీస్ కోర్సులను కొత్తగా ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు బొమ్మదేవర ప్రభాకర్, పి.దుర్గాప్రసాద్, సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

67 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి



ఆర్ఎస్ ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో 67 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి చేశామని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో 79,774 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 52,678 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. ధాన్యం కొనుగోలు పూర్తయిన ఆర్బీకేల్లో కొనుగోలు శనివారం నుంచి ప్రక్రియ మూసివేస్తామన్నారు. ఈ నెల 23 నుంచి అధిక వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. రైతులు వెంటనే ధాన్యాన్ని విక్రయించాలని, ఆరుతడి పంటలకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విత్తనాల కోసం రైతులు ఆర్బీకే ఇన్చార్జీలను సంప్రదించాలన్నారు. పిల్లిపెసర 14 టన్నులు, జీలుగ 9.5 టన్నులు, జనుము 1.5 టన్నుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలని కోరారు.

కల్యాణ కేశవస్వామి పుష్పోత్సవం



కేశవస్వామి ఆలయంలో పుష్పోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి

యలమంచిలి: స్థానిక కేశవస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వారి సప్తాహ్నిక కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం దేవేరుల పుష్పోత్సవం ఆలయ అర్చకులు వాడపల్లి గోపాలకృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో పుష్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షిక కల్యాణోత్సవాల్లో దేవేరులకు నిత్య పూజలు, నిత్య హోమం, భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

నేడు పాస్టర్లకు ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు అర్బన్: పూలపల్లి ఎలీమ్ స్కూల్ ఆవరణలో బుధవారం7 గంటల నుంచి 11గంటల వరకు పాలకొల్లు పట్టణ, రూరల్ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్ల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ గౌరవాధ్యక్షుడు అధ్యక్షుడు ఐ సెయింట్పాల్, సంఘ అధ్యక్షుడు గోబేరు కృపా శ్యాంసన్ తెలిపారు. బీపీ, సుగర్, కిడ్నీ, క్యాన్సర్, సాధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ సదావకాశాన్ని పట్టణ, రూరల్ గ్రామాల్లో పనిచేస్తున్న పాస్టర్ల కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి

నరసాపురం: పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉందని నరసాపురం గ్రేడ్-1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో మంగళవారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. తరువాత కథలు చెప్పడం, యోగా, లెక్కల సబ్జెక్ట్లో మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు. వచ్చేనెల 7వ తేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.

పూడుకుపోయిన డ్రెయిన్

నరసాపురం: పట్టణంలోని రాయిపేటలో ఆంధ్రాబ్యాంక్ రోడ్డులోని డ్రెయిన్ పూడుకుపోయి మురుగుపారడంలేదు. డ్రెయిన్ నుంచి దుర్గంధం వెదజల్లడంతో అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్ను శుభ్రం చేసి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా సాయిబాబా పవిత్రోత్సవాలు

ఆకివీడు: ఈనెల 18వ తేదీ నుంచి స్థానిక గుమ్ములూరు సెంటర్లోని సాయిబాబా ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హోమగుండాల వద్ద భక్తులు శాంతి హోమం, హారతులు, అభిషేకాలు, పవిత్రోత్సవ పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ సాయి ఋత్వికులచే సత్సంగ సభలు జరుగుతున్నాయి. 22న షిరిడి సాయిబాబా వారికి చందనోత్సవం, 24న అఖండ సాయినామ సంకీర్తన, 100 అడుగుల సాయి కోటి మహాస్థూపం నుంచి బాబా వారి ఊరేగింపు నిర్వహించనున్నారు. 25వ తేదీ ఉదయం 4.30 గంటలకు ఐదు కోట్ల సాయి నామములు గల పుస్తకాలను సాయి కోటీశ్వర్ మహా స్థూపంలో నిక్షిప్తం చేయనున్నారు. అనంతరం ఉచిత సాయి సత్య వ్రతములు, ప్రార్థనలు ఉంటాయని పవిత్రోత్సవ ఉత్సవ నిర్వాహకులు, ఆకివీడు సాయి ఆశ్రమ గురువు కోపల్లె సూర్యనారాయణ చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.



ఆకివీడు: బాబాను దర్శించుకుంటున్న భక్తులు



భీమవరం (ప్రకాశం చౌక్): తులసి మొక్కలతో బృందార్చన చేస్తున్న దృశ్యం

శ్రీవారి ఆలయంలో తులసి బృందార్చన

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక జె.పి రోడ్డులోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 108 మంది మహిళలచే తులసి మొక్కలతో తులసి బృందార్చన నిర్వహించారు. ఆలయ ఈవో రుద్రరాజు గంగాశ్రీదేవి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు శ్రీవారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలచే తులసి బృందార్చన, అష్టదళ పాద పద్మారాధన, స్వామివారికి పట్టువస్త్రాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 22న అమ్మవారికి లక్ష కుంకుమార్చన, రథోత్సవం, పుష్పయాగోత్సవం, 23న పూర్ణాహుతి, 25న అఖండ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో గంగాశ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంతెన రామకుమార్ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారికి పుష్ప యాగోత్సవం

వీరవాసరం: రాయకుదురులో వేంచేసి ఉన్న శ్రీ భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు శ్రీ పుష్ప యాగోత్సవం నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం శ్రీనివాస దీక్షితులు, కొండవీటి రామచంద్రరావు దంపతులు, వెంకటేశ్వరరావు, శివన్నారాయణ, నారాయణం ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాళ్ళకూరు వెంకన్నకు ప్రత్యేక పూజలు

కాళ్ల: కాళ్ళకూరులో వేంచేసియున్న స్వయంభూః శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానం నందు శ్రీస్వామివారి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 5వ రోజు మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యోపాసన, బలిహరణ, సహస్రనామార్చన (లిల్లీ) పుష్పార్చన, అనంతరం స్వామివారిని పల్లకి వాహన సేవ చేసి గ్రామోత్సవం జరిపారు. శ్రీవారికి లిల్లీ పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం అరుణ్ కుమార్ అధికారులు సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నైతికతతో వ్యవహరించాలి

తణుకు టౌన్: ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులను విలువ కట్టే విషయంలో వాల్యూయర్ ఖచ్చితత్వంతో పాటు నైతికతతో మెలగాలని ఇండియన్ బ్యాంక్ విశాఖ జోనల్ మేనేజర్ పీఎస్ఎస్ సుధాకరరావు అన్నారు. మంగళవారం ఇన్స్టిట్యూట్ ఆఫ్ వ్యాల్యూస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తణుకులోని చిట్టూరి హెరిటేజ్లో ఐవోవీ విజయవాడ జోన్ చైర్మన్ పి.మురళీ కృష్ణ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో సుధాకరరావు మాట్లాడారు. సీనియర్ వ్యాల్యూయర్స్ ఎస్ రామగోపాల్, ఎస్ సాయివరప్రసాద్, హైకోర్టు న్యాయవాది ఈఎస్ ప్రసాద్, ఐవోవీ విజయవాడ ప్రధాన కార్యదర్శి పి.మదన్మోహన్రావు, కోశాధికారి పి.సింగయ్య, వైస్ చైర్మన్లు పి.శ్రీనివాసరాజు, రాజా హెచ్ వెంకట సత్య, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు జేహెచ్ వీఏ ప్రసాద్, ఎస్ శ్రీనివాసరావు, వీఎస్ వాసు, బీఎన్ఎస్ఎన్ మూర్తిబాబు పాల్గొన్నారు.

సాధారణ, మిగులు నిధులపై కౌన్సిల్ తీర్మానం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ సాధారణ నిధుల వినియోగం, మిగులు నిధులపై సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. కార్యాలయ ఆవరణలో మంగళవారం సర్వసభ్య సమావేశం చైర్పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఈ నెల ఆదాయం రూ.1.91 కోట్లు కాగా జీతభత్యాలకుగాను రూ.1.51 కోట్లు వెచ్చించినట్లు కమిషనర్ జీ.కృష్ణ మోహన్ తెలిపారు. పట్టణంలో అమలు జరుగుతున్న టౌన్ప్లానింగ్ విధానంపై పలువురు సభ్యులు పలు ప్రశ్నల్ని లేవనెత్తారు. ప్రకటనలపై రుసుము వసూలు చేసుకునేందుకు గత సమావేశంలో తీర్మానం ప్రకారం జిల్లా కలెక్టర్ వద్ద నుంచి వచ్చిన సూచనల మేరకు ప్రకటనల పన్ను వసూలు చేస్తున్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ చెప్పారు. రూ.2.50 లక్షల ఆదాయం నగర పంచాయతీకి వచ్చిందన్నారు. సమావేశంలో వైస్చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, నిమ్మల నాగు, గేదల అప్పారావు, దొడ్డి జగదీష్, తిమ్మారెడ్డి మాధవి, మోటుపల్లి కుమారి, అగ్రపున్నీస్సాబేగం, కోఆప్షన్ సభ్యులు మన్నే లలితాదేవి, గుండుగొలను సావిత్రి, ఎండీ జక్కీ ఇతర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న చైర్పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్లు

ఘనంగా సోమాలమ్మ జాతర

పాలకోడేరు: స్థానిక రాజు కాలువ గట్టు ప్రాంతంలో స్వయంభుగా వెలసిన సోమాలమ్మ అమ్మవారి 35వ జాతర మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లి సోమాలమ్మను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం



పిట్టా రాజ్కుమార్

పాలకొల్లు అర్బన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిని బట్టి 2019కి కన్నా 2024లో వైఎస్సార్ సీపీకి అత్యధిక స్థానాల్లో విజయం సాధించి ప్రభంజనం సృష్టించబోతోందని పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు పిట్టా రాజ్కుమార్ జోస్యం చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పోలైన మొత్తం ఓట్లలో 70శాతం మహిళలు వైఎస్సార్ సీపీకి ఓటు వేశారని స్పష్టమవుతోందన్నారు. మొత్తం ఓట్లలో 40శాతం మంది పురుషులు వైఎస్సార్ సీపీకి ఓటు వేశారని సర్వే ఫలితాలను బట్టి తెలుస్తోందన్నారు. గ్రామీణ ఓట్లలో 65శాతం వైఎస్సార్ సీపీకి, పట్టణ ప్రాంతంలో 30మంది వైఎస్సార్ సీపీకి ఓటు వేశారన్నారు. దీన్ని బట్టి ముఖ్యమంత్రిగా రెండోసారి ప్రమాణస్వీకారం చేయడం ఖాయమన్నారు.

ముగిసిన జాజులమ్మ ఆలయ వార్షికోత్సవాలు



జాజులమ్మ అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: యర్రంశెట్టిపాలెం గ్రామం పితానిమెరకలో వేంచేసి ఉన్న జాజులమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. రెండురోజులుగా అమ్మ వారి వార్షికోత్సవాలను కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం గ్రామదేవతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు ఆడపడుచులు దూర ప్రాంతాల నుంచి వచ్చారు.అమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా పెద్ద ఎత్తున ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. జాజులమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా ఏర్పాట్లుచేశారు. ఏటా దాళ్వా పంటలు చేతికందిన అనంతరం మే నెలలో అమ్మవారి ఉత్సవాన్ని రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో 11 కేవీ లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించడం, వార్షిక మరమ్మతుల నిమిత్తం బుధవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ మంగళవారం తెలిపారు. గొల్లవానితిప్ప, ఎల్వీఎన్ పురం, పల్లిపాలెం, ఈలంపూడి గ్రామాలతో పాటు దిరుసుమర్రు ఇండస్ట్రియల్ లైన్లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సుందరకాండ మహాయజ్ఞం

పాలకోడేరు: వేండ్ర రైల్వే గేటు పక్కన గల శ్రీ గోస్తని నదీ తీరంలోని శ్రీ కోదండ రామాలయంలో వైశాఖ శుద్ధ పూర్ణిమ పురస్కరించుకుని బుధవారం సుందరకాండ మహాయజ్ఞం, హనుమాన్ చాలీసా, శ్రీరామనామ జపం, శ్రీరామ రక్షా స్తోత్రమ్ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. సనాతన ధర్మాన్ని రక్షించేందుకు, దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి విశ్వగురు స్థానంలో నిలిపేందుకు ప్రధాని మోడీ చేస్తున్న సంకల్పానికి శక్తి ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని కమిటీ కోరింది.

విద్యార్థినికి సత్కారం



వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మౌనిషను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చడమేగాక పాలిసెట్, ఏపీఆర్జేసీలో రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు సాధించిన విద్యార్థి గోపిశెట్టి మౌనిషను మంగళవారం భీమవరం పట్టణంలోని మారుతి నగర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. శాలువతో సత్కరించి జ్ఞాపిక, నగదు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా జిల్లా ట్రెజరీ ఆఫీసర్ ఎ గణేష్, జిల్లా దేవాదాయ శాఖాధికారి సుబ్బారావు మాట్లాడుతూ పట్టుదలతో కృషిచేస్తే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బండ శ్రీరామ్, మారుతీ వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కామన నాగేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు పాపిరాల రామ్మోహనరావు, వలవల నర్సింహరావు, సహాయ కార్యదర్శి కొవ్వలి శ్రీనివాస్, జీవీకే వరప్రసాద్, సీఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సకుమళ్ల సత్యనారాయణ, మిర్తిపాటి గుణేశ్వరరావు, బీవీ నాయుడు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన



మొగల్తూరులో పొలంలోనే ఉన్న వరి పనలు

మొగల్తూరు: నాలుగు రోజులుగా పగలు ఎండలు, రాత్రి సమయంలో ఆకాశం మేఘావృతం కావడంతో వరి, మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మొగల్తూరు మండలంలో సుమారు 1,191 ఎకరాల్లో వరి సాగు చేశారు. మాసూళ్లు పూర్తయిన రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకున్నారు. మొగల్తూరు, రామన్నపాలెంలో ఇంకా 70 ఎకరాల్లో పండిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాల్సి ఉంది. రాత్రి సమయంలో వర్షం కురిస్తే చేలల్లోని వరి పనలు తడిసి పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వారం రోజుల పాటు వర్షాలు కురవకుండా ఉంటే గట్టెక్కుతామని వరి, మామిడి రైతులు పేర్కొంటున్నారు.

స్పర్శ లేని రాగి రంగు మచ్చలను అశ్రద్ధ చేయొద్దు



రోగిని పరీక్షిస్తున్న మెడికల్ ఆఫీసర్ ప్రతాప్కుమార్

పాలకొల్లు అర్బన్: మండలంలోని గవరపేటలో ఒక రోగి శరీరంపై రాగిరంగు మచ్చలున్న కొత్త కేసును గుర్తించి మందులు అందించినట్లు డాక్టర్ అద్దాల ప్రతాప్ కుమార్ చెప్పారు. మంగళవారం గ్రామంలో పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించే సమయంలో ఒక రోగి శరీరంపై స్పర్శలేని, తిమ్మిరితో ఉన్న మచ్చలు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీన్ని హ్యాన్సన్స్ వ్యాధిగా పిలుస్తారన్నారు. ఇది మైకో బాక్టీరియమ్ లేప్రి అనే సూక్ష్మ క్రిమి ద్వారా శరీరంలో ప్రవేశిస్తుందన్నారు. ఇది 5 నుంచి 10 ఏళ్ల కాలంలో ఎప్పుడైనా రోగం బయట పడి నరాలపై పనిచేసి రోగిని వికలాంగులుగా చేస్తుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే ఎండీటీ మందులతో వ్యాధి పూర్తిగా నయం అవ్వడ మే కాకుండా వికలాంగులుగా మారకుండా నివారిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ శరీరంపై స్పర్శలేని రాగిరంగు గల మచ్చలు కనిపిస్తే ఆ ప్రాంతంలోని ఏఎన్ఎం, లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మెడికల్ ఆఫీసర్ని సంప్రదించాలన్నారు. వ్యాధి తీవ్రత ఆధారంగా 6 నెలలు నుంచి 12నెలలపాటు మందులు వాడి వ్యాధిని నివారించుకోవాలని సూచించారు.

అందుబాటులో గోనె సంచులు

యలమంచిలి: దాళ్వా పంటకు సంబంధించి ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి శింగలూరి దేవి చెప్పారు. యలమంచిలి మండలంలో దాళ్వా పంటకు 5,513 ఎకరాల్లో వరి సాగు చేయగా ఇంత వరకు 5,110 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయన్నారు. ఈ ఏడాది 18,331 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆమె వివరించారు. ఈ ధాన్యానికి 4,57,648 గోనె సంచులు కావలసి ఉండగా ఇంత వరకు 3,28,750 గోనె సంచులు వచ్చాయన్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా 10,300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు ఆమె చెప్పారు. మిగిలిన ధాన్యానికి అవసరమైన గోనె సంచులు రైతు భరోసా కేంద్రాల వద్ద సిద్ధంగా ఉన్నాయని ఆమె వివరించారు.



యలమంచిలిలో ధాన్యం సేకరణను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి శింగలూరి దేవి

గ్రామాల్లో జల్లెడ పడుతున్న పోలీసులు

- ముమ్మరంగా కార్డన్ సెర్చ్
- పత్రాలు లేని వాహనాల స్వాధీనం

పెనుగొండ: గ్రామాల్లో పోలీసుల హడా వుడి ప్రజలకు దడ పుట్టిస్తుంది. ఎన్నడూ లేని విధంగా కార్డన్ సెర్చ్ పేరుతో పోలీ సులు గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు. దీంతో ప్రజలు హడలిపోతున్నారు. తెల్లవారక ముందే పోలీసులు ఇంటి ముందు ప్రత్యక్ష మవుతుండడంతో ఏమి జరిగిందోనంటూ బేజారెత్తిపోతున్నారు. కొత్త ఒరవడికి పోలీసులు శ్రీకారం చుట్టడంతో ఉదయం గ్రామాలు బోర్డర్లను తలపిస్తున్నాయి. ఎన్నికలు పూర్తి కావడంతో రాయలసీమ వంటి ప్రాంతాల్లో అల్లర్లు జరగడం, ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో శాంతి భద్రతలను కాపాడడం కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీసులు కార్డన్ సెర్చ్ ప్రారంభించారు. దీని ప్రకారం ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో అకస్మాత్తుగా ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని, ఎటువంటి సమాచారం బయటకు పొక్క కుండా ముందు జాగ్రత్తలు తీసుకొని ఒక్కసారిగా తెల్లవారు జాం నుంచే ప్రతీ ఇంటిని జల్లెడ పడుతున్నారు. ఎవరైనా కొత్తవారు ఆ ప్రాంతానికి వచ్చారా?, వస్తే ఎందుకు వచ్చారు? వారు ఏ వాహనాల్లో వచ్చారు వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. దీంతో పాటు వారి వద్ద అక్రమంగా మందు గుండు సామగ్రి ఉన్నా, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. తొలుత పెనుగొండ సర్కిల్ పరిధిలోని చెరుకువాడలో కార్డన్ సెర్చ్ ప్రారంభించారు. దీంతో ప్రజలంతా ఉలిక్కిపడ్డారు. ప్రతి వీధిలోనూ పోలీసుల పహారా నిర్వహించి, అనుమానాస్పదంగా ఉన్న ఇళ్లను తనిఖీ చేశారు. దీంతో పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకూ పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వందలాది వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి ధ్రువీకరణ పత్రాలు చూపిస్తే వాటిని తిరిగి అప్పగిస్తామన్నారు. పాత నేరస్తులపై మరింత నిఘా పెంచారు. ఓట్ల లెక్కింపు వరకూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని పోలీసు అధికారులు ప్రకటించారు.



పెనుగొండలో కార్డన్ సెర్చ్పై ఆదేశాలు ఇస్తున్న సీఐ రజనీకుమార్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామా ల్లో కార్డన్ సెర్చ్ నిర్వ హిస్తున్నాం. అసాంఘి క కార్యక్రమాలకు చెక్చెప్పడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. ఓట్ల లెక్కింపువరకూ శాంతి భద్రతలను కాపాడేందుకు అన్ని గ్రామాల్లోనూ ఆకస్మికంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తాం.

– నక్కా రజనీకుమార్, సీఐ, పెనుగొండ